క్లుప్తంగా

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు వినతి


ఎమ్మెల్యే నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సేవాసంఘం సభ్యులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరం ఎస్సీ కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ఆది ఆంధ్రా యువజన సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కాలువలు ఛిద్రమయ్యాయని, వాటిని కూడా నిర్మించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, మార్టుపూడి పరదేశి, వెంకటేష్, పెద్దాడ వెంకటరమణ, శంకరరావు, అప్పారావు, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామాలయ ఆవరణలో స్వచ్ఛభారత్


రామాలయ ఆవరణను శుభ్రం చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో 85వ వార్డు కొండయ్యవలస రామాలయం ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, గ్రామ నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని ఆవరణలోని చెత్తా చెదారాన్ని తొలగించారు. ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి, శుభ్రం చేశారు.

కమనీయం .. కల్యాణం


అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం


ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సుజాత

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామంలో శ్రీ బంగారమ్మ ఆదిదేవతల ఆలయాలకు వెళ్లే మార్గంలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన ముఖద్వారాన్ని సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు మంగళవారం ప్రారంభించారు. ముత్యాలు తల్లిదండ్రులైన దివంగత చింతకాయల ముత్యాలు, అమ్మోరమ్మ జ్ఞాపకార్థం దీన్ని నిర్మించారు. డప్పులు, సాముగరిడీలు, నేలడ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవార్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, ముత్యమాంబ ఆలయ కమిటీ చైర్మన్ కూండ్రపు చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రణవరూపిణి..జ్ఞానప్రదాయిని

జ్ఞానప్రదాయిని, శాంతస్వరూపిణి.. రాజరాజేశ్వరీ దేవి. నవరాత్రి ఉత్సవాల్లో ఆఖరి రోజు విజయదశమి వేళ దుర్గామాతను రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు కనులపండువగా సాగిన మహోత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిశాయి. ప్రత్యేక పూజలు, అన్నసమారాధనలతో ఆలయాల్లో, మండపాల్లో సందడి నెలకొంది.

- రాజరాజేశ్వరిగా కొలువుదీరిన దుర్గాదేవి
- వైభవంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు


ఆకట్టుకుంటున్న శివపార్వతులు, సీతారాముల వేషధారణలు

ఉక్కునగరం: త్రిశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ఉదయం ఆలయంలో మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవార్లకు వేకువజామున ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో వాహన పూజలు చేశారు. సాయంత్రం రుత్వికుల ఆధ్వర్యంలో నవచండీ యాగ మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం జమ్మిపూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీమహాదుర్గ అమ్మవారు గులాబీ వర్ణం చీరలో రాజరాజేశ్వరిగా, శ్రీమహాలక్ష్మి అమ్మవారిని బంగారు వర్ణం చీరలో మహాలక్ష్మీదేవిగా, శ్రీమహాసరస్వతి అమ్మవారిని పసుపు వర్ణం చీరలో వరదాయినిగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

రాజరాజేశ్వరి దేవిగా పోలమాంబ

అక్కిరెడ్డిపాలెం: ఎస్టీబీఎల్ ఎల్ఎస్ గార్డెన్స్‌లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా పోలమాంబ అమ్మవారు మంగళవారం శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


రాజరాజేశ్వరి అవతారంలో శ్రీమహాదుర్గ


మహాలక్ష్మీదేవి అలంకరణలో శ్రీమహాలక్ష్మి


వరదాయినిగా శ్రీమహాసరస్వతి


ఎస్టీబీఎల్ ఎల్ఎస్ గార్డెన్స్‌లో రాజరాజేశ్వరి దేవిగా పోలమాంబ


గాజుల అలంకరణలో కుంచుమాంబ


డ్రైవర్స్ కాలనీలో విశేష అలంకరణలో కనకదుర్గమ్మ

గాజులతో కుంచుమాంబ అలంకరణ

జగ్గయ్యపాలెంలో కొలువైయున్న కుంచుమాంబ అమ్మవారిని గాజులతో అలంకరించారు. అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు.

నెమలి పింఛాల అలంకరణలో అమ్మవారు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి గవరవీధిలో శ్రీదుర్గాగౌరీ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారిని నెమలి పింఛాలతో విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించారు. విజయదశమి సందర్భంగా వాహన పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, శ్రీదుర్గాగౌరీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైవర్స్ కాలనీలో..

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డు ఎల్వీ నగర్ కనకదుర్గ ఆలయంలో, డ్రైవర్స్ కాలనీ కనకదుర్గ ఆలయంలో విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. అమ్మవారికి వేకువజామున ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విజయదుర్గకు అభిషేకాలు జరిపించారు.

ఆకట్టుకున్న నవదుర్గలు

పెదగంట్యాడ: 75వ వార్డు నెల్లిముక్కు పెంటమాంబ యూత్ ఆధ్వర్యంలో ధర్మాల వీధిలో నిర్వహించిన వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారికి ఘటాభిషేకాలు చేశారు. అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. తిరువీధి ఉత్సవంలో నవదుర్గలు, సీతారాములు, పార్వతీపరమేశ్వరులు, కాంతారా వేషధారణల్లో కళాకారులు ఆకట్టుకున్నా రు. చివరి రోజు శివపార్వతుల కల్యాణం జరిపించారు. 76వ వార్డు బర్మా కాలనీలోని దుర్గాదేవి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది.

రాజరాజేశ్వరిగా దుర్గాలమ్మ

అగనంపూడి: దుర్గాదేవి నవరాత్రుల్లో దశమ అవతారంగా దుర్గాలమ్మ వారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జీవీఎంసీ 86వ వార్డు అగనంపూడిలోని దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు నిర్వహించారు. అగనంపూడి ప్రాంతానికి చెందిన బొర్రమాంబ పారాయణ కమిటీ ఆధ్వర్యంలో లలిత, విష్ణు సహస్ర పారాయణం చేశారు. తరువాత లక్కీ డిప్ విజేతలకు చీరలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఆధ్వర్యంలో ఆలయ, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పర్యవేక్షించాయి.


కణితి గవరవీధిలో అమ్మవారికి నెమలి పింఛాలతో అలంకరణ


రాజరాజేశ్వరీ దేవి రూపంలో దుర్గాలమ్మ


ఎల్వీ నగర్‌లో ప్రత్యేక అలంకరణలో దుర్గామాత


బర్మా కాలనీలో పూజలందుకుంటున్న దుర్గాదేవి


లక్కీడిప్ విజేతలకు చీరలు బహూకరిస్తున్న ఆలయ కమిటీ


శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

దుర్గాదేవి ఆశీస్సులతో కార్మికుల విజయం తథ్యం


985వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి కార్మిక వర్గం నుంచి వస్తున్న వ్యతిరేకతే దీనికి నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 985వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరాను జరుపుకోవడం ఆనవాయితీ అని, దుర్గాదేవి ఆశీస్సులతో నిరవధికంగా కొనసాగుతున్న ఉక్కు పోరాటానికి త్వరలోనే విజయం చేకూరుతుందన్నారు. కార్మికులు సాధించిన విజయాన్ని గొప్ప జరుపుకొంటామని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ చెడు నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నామని, దీనికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించి ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. సాయి రూపం


గాజుల అలంకరణలో సాయినాథుడు

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో కొలువుదీరిన సాయిబాబాను దసరా సందర్భంగా గాజులతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సాయినాథుడిని దర్శించుకున్నారు. అభిషేకాలు, అర్చనలు చేశారు.

అగనంపూడి సాయిబాబా ఆలయంలో..

అగనంపూడి: అగనంపూడిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయిబాబా కైవల్యం పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ మహిళలు సాయి నామస్మరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొయ్య వెంకటరమణారెడ్డి, పెదమడక సంపత్ వినాయక ఆలయ కమిటీ చైర్మన్ మోటూరి వెంకటరమణ, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ధర్మాల వ్యాసశర్మ, పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో అన్న సమారాధన


చిన అక్కిరెడ్డిపాలెంలో అన్న సమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


హౌసింగ్‌బోర్డ్ కాలనీలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: చినఅక్కిరెడ్డిపాలెంలో దుర్గాదేవి పూజా కమిటీ నేతృత్వంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నసమారాధనను ప్రారంభించారు. 6 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు వరదాడ వెంకటరమణ, సంగ్రాన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో..

పెదగంట్యాడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో చోరీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో సెక్టార్-11లోని 522డీ క్వార్టర్‌లో దొంగతనం జరిగింది. స్టీల్‌ప్లాంట్ క్రైం పోలీసులు అందించిన వివరాలివి.. క్వార్టర్స్‌లో నివాసముంటున్న ఉద్యోగిని అనూజ మిశ్రా స్టీల్‌ప్లాంట్ కంపెనీ ఎఫైర్స్ విభాగంలో పని చేస్తున్నారు. క్వార్టర్స్‌లో ఆమె తన తల్లితో ఉంటున్నారు. ఈ నెల 16న వారు ఊరెళ్లారు. మంగళవారం ఉదయం అదే బ్లాక్‌లో ఉన్న సహోద్యోగులు చూడగా ఇంటి ముందు తాళంకప్ప లేదు. దీంతో అనుమానం వచ్చి అనూజ మిశ్రాకు సమాచారం ఇవ్వగా.. ఆమె స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఊరి నుంచి తిరిగివచ్చిన అనంతరం ఆమె పరిశీలించగా.. ఇంట్లో ఉండాల్సిన సుమారు రెండు తులాల బరువు కలిగిన చెవి దిద్దు, రింగులు, ముక్కు పుడకలు, 100 తులాల వెండి సామగ్రి చోరీకి గురైనట్టు గుర్తించి, పోలీసులకు తెలియజేశారు. దీంతో క్రైం ఎస్ఐ ఎల్. శ్రీనివాసరావు క్వార్టర్‌కు వచ్చి పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. అనూజ మిశ్రా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.


ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్త్రాలు, వస్తువులు

వెలగని వీధి దీపాలు


పని చేయని విద్యుద్దీపాలు

గాజువాక: సుందరయ్య కాలనీ దరి దుర్గానగర్ నుంచి సర్దార్ నెస్ట్ వరకు విద్యుద్దీపాలు పని చేయకపోవడంతో ఆ కాలనీవాసులు అవస్థలకు గురవుతున్నారు. నెలల తరబడి లైట్లు పని చేయకపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ రోడ్‌లో భారీ వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తాయని, రాత్రిపూట చీకటిగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి విద్యుద్దీపాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

నూతన కార్యాలయం ప్రారంభం

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 88వ వార్డు గ్రీన్‌సిటీలో వైజాగ్ ప్రొఫైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ బిజినెస్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఆడ్లర్ స్టీల్ లిమిటెడ్ కెనడా వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ హాజరై, కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాన్ని ప్రారంభించిన వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేష్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, చిన్న సురేష్, సృజన, హర్ష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎండీ అతుల్‌భట్

విండ్‌బాల్ క్రికెట్ విజేత 'రైజింగ్ స్టార్స్'

గాజువాక: జీహెచ్ఆర్ యూత్ ఆధ్వర్యంలో గాజువాక హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన విండ్ బాల్ క్రికెట్ పోటీల్లో విజేతగా రైజింగ్ స్టార్స్ జట్టు నిలిచింది. ద్వితీయ స్థానాన్ని హైస్కూల్ రోడ్ యూత్ జట్టు గెలుచుకుంది. ఈ సందర్భంగా విజేతలకు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి స్థానం సాధించిన జట్టుకు రూ.10వేలు, ద్వితీయస్థానం సాధించిన జట్టుకు రూ.6వేలు నగదుతో పాటు రెండు జట్లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా పెంటారావు, బీజేపీ నాయకుడు గూటూరు శంకరరావు, పోటీల నిర్వాహకులు గణేష్, మధు, జగదీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులను అందజేస్తున్న కరణంరెడ్డి

డంపింగ్‌యార్డులా ఆటోనగర్ ఈ-బ్లాక్


ఆటోనగర్ ఈ-బ్లాక్‌లో చెత్త తగలబెడుతున్న దృశ్యం


ఈ-బ్లాక్‌లో రోడ్డుపైనే భవన నిర్మాణ వ్యర్థాలు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ ఈ-బ్లాక్ డంపింగ్ యార్డును తలపిస్తోంది. వడ్లపూడి, కూర్మన్నపాలెం తదితర ప్రాంతాలను ఆనుకొని ఉండటంతో స్థానికులు కొందరు రాత్రి వేళల్లో చెత్తను వాహనాల ద్వారా తరలించి, ఇక్కడ రోడ్డుపై డంప్ చేస్తున్నారు. దీనికి తోడు వీరు చెత్తను తగలబెట్టడంతో సమీపంలోని పరిశ్రమల్లో పని చేస్తున్నవారు ఇబ్బంది పడుతున్నారు. చెత్తతో పాటు భవన నిర్మాణ వ్యర్థాలను కూడా రోడ్డుపైనే డంప్ చేయడంతో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒక్క ఆటోనగర్ ఈ - బ్లాక్ లోనే కాకుండా, పారిశ్రామిక శివారు ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంటోందని పలువురు పారిశ్రామిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రమంగా ఆటోనగర్‌లోని స్థలాలు కూడా కబ్జాకు గురవుతున్నాయని, దీనిపై ఐలా కమిటీకి, ఐలా కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామని తెలియజేస్తున్నారు.

గస్తీ ఏర్పాటు చేస్తాం

ఈ సమస్యపై ఐలా కమిషనర్ జయచంద్రను, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణరెడ్డిని సంప్రదించగా పారిశ్రామిక ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. చెత్తను డంప్ చేస్తున్నవారిపై కేసులు నమోదు చేసి, వాహనాలు స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. కబ్జాకు పాల్పడినా, చెత్త డంప్ చేసినా గుర్తించి, కమిటీ పరంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

జమ్మి ఉత్సవం.. పరవశించిన భక్త జనం


విద్యుత్ కాంతుల్లో పూలతోటలోని శ్రీకృష్ణ కొలను


కోలాటం ఆడుతున్న మహిళలు

సింహాచలం: సింహగిరి భక్తులతో పులకించింది. అంతటా ఆధ్యాత్మికత ఉట్టిపడింది. మంగళవారం విజయదశమి పర్వదినాన స్వామిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి జరిగిన జమ్మివేట ఉత్సవంలో భక్తులు తరించా రు. రామాలంకారంలో స్వామిని కనులారా వీక్షించి పరవశించారు. విద్యుత్ కాంతులతో కొండదిగువ పూల తోట నూతన శోభ సంతరించుకుంది. ఉత్సవా న్ని తిలకించేందుకు పూలతోటకు వేలాది మంది భక్తులు క్యూ కట్టారు. సాయంత్రం 5గంటల సమయంలో సింహగిరి నుంచి కొండదిగువకు మెట్లమార్గంలో స్వామివారిని తీసుకొచ్చారు. అక్కడ దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అధికారులు, అడవివ రం గ్రామస్తు లు ఘన స్వాగతం పలికారు. అక్కని నుంచి స్వామిని పూలతోటలోకి తీసుకెళ్లారు. పూల తోటలోని మండ పంలో జమ్మివేట ఉత్సవం విశేషంగా జరిగింది. అలాగే అడవివరం పురవీధిల్లో అశ్వవాహనంపై స్వామి తిరువీధి ఘనంగా జరిగింది. దేవస్థానం ట్రస్టీబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, సువ్వాడ శ్రీదేవి తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు.

అప్పన్న భక్తులకు కొర్రబియ్యం పాయసం


భక్తులకు పాయసం అందిస్తున్న సిబ్బంది

సింహాచలం: విజయదశమిని పురస్కరించుకుని మంగళవారం సింహగిరిపై అన్నప్రసాద భవనంలో భక్తులకు అన్నప్రసాదంతో పాటు కొర్రబియ్యం పాయసం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి భక్తులతో పాటు కలిసి అన్నప్రసాదభవనంలో సహపంక్తి భోజనం చేశారు. ఆలయ ఏఈవో పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


భోజనం చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి